క్లుప్తంగా

కనుల పండువగా సంతానలక్ష్మీ కల్యాణం

పాత గుంటూరు: అరండల్‌పేట 4వ లైనులోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సంతానలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేటి నుంచి లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ మహోత్సవాలు

పాత గుంటూరు: పాత గుంటూరు సుద్దపల్లి డొంక రోడ్డులోని లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి 7 వరకు అమ్మవారి రజతోత్సవ కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు పాదిల మహేష్, సురేంద్ర, పవన్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. 5న ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, అఖండ దీప స్థాపన, తులసిపూజ, సుదర్శన హోమాలు, లక్ష్మీ గణపతి హోమం, జలబిందెల ఊరేగింపుతో స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6న రాత్రి 8.52 నిమిషాలకు స్వామివారి కల్యాణం, 7న అన్నదానం, ఉత్సవ మూర్తుల రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉల్లాసంగా బృందావన శ్రీనివాసుని హనుమత్ సేవ



పాత గుంటూరు: బృందావన శ్రీనివాసుని హనుమత్ వాహనం, గరుడ వాహనంపై తిరువీధులలో కనుల పండువగా నగరోత్సవం శనివారం నిర్వహించారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో తాళ్లాయపాలెం శైవక్షేత్రం శివస్వామి, పరశివానంద భారతీస్వామి పాల్గొన్నారు. కార్యక్రమానికి బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయ్‌బాబు, బొల్లేపల్లి సత్యనారాయణ, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, వూటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, అచ్యుత రామయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: ఆర్.అగ్రహారంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం 27వ వార్షిక బ్రహ్మోత్సవం ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు దాసరి భాస్కరరావు శనివారం తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5, 6, 7 తేదీల్లో విశేష పూజలు, అర్చనలు జరుగుతాయని, 8న ఉదయం 9.30 గంటలకు శ్రీవారి కళ్యాణం, సాయంత్రం 6 గంటలకు దివ్య రథోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9, 10న ప్రత్యేక పూజలతోపాటు, అర్చనలు జరుగుతాయన్నారు. ఈసందర్భంగా ఉత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో పాత కోట రమేష్, అడపా వెంకటసుబ్బారావు, అడపా రాజా, యోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: సెల్‌ఫోన్ అడిగి తీసుకుని మోసపూరితంగా డబ్బులు డ్రా చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నన్నెబోయిన వీరాంజనేయులు నల్లపాడు రోడ్డులో సిమెంట్ షాపు నిర్వహిస్తుంటాడు. శనివారం ఓ వ్యక్తి సిమెంటు షాపునకు వచ్చి కొన్ని బస్తాలు కొనుగోలు చేశాడు. డబ్బులు ఇంటి వద్ద ఉన్న తన బాబాయి సెల్ నుంచి పేటీఎం ద్వారా పంపిస్తానని చెప్పాడు. బాబాయితో మాట్లాడాలని వీరాంజనేయులు సెల్ తీసుకుని కొంత సేపు మాట్లాడాడు. సాంకేతిక కారణాలు చెప్పి డబ్బులు ఇంటికి వెళ్లి తీసుకొస్తానని వెళ్లిపోయాడు. వీరాంజనేయులు కొంతసేపు తరువాత సెల్ పరిశీలిస్తే తన అకౌంట్‌లో రూ.95వేలు విత్‌డ్రా అయినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు

మేయర్ కావటి మనోహర్ నాయుడు



ఎత్తు రోడ్డు సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యపై అధికారులతో చర్చిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: ఎత్తు రోడ్డు వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. గుంటూరు నగరంలోని ఎత్తు రోడ్డు సెంటర్‌లో స్థానిక ప్రజా ప్రతినిధులు, స్థానిక పెద్దలు, పోలీస్ అధికారులతో కలసి శనివారం పర్యటించారు. ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న పలు అంశాలను గుర్తించి, వాటిని తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని ఎత్తు రోడ్డు జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న పలువురు నేతల విగ్రహాలను అదే ప్రాంతంలో ట్రాఫిక్‌కు అడ్డుగా లేని ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి, జంక్షన్‌లో ఆక్రమణలు తొలగించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గుంటూరు నగరంలో రోజు రోజుకి పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు తప్పనిసరిగా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే గుంటూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న పలు ప్రధాన రహదారుల్లో రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే అడపా బజార్ నుంచి వెంకటేశ్వర స్వామి గుడి వరకు ఉన్న ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్ సైజు తగ్గించి రోడ్డు విస్తరణ చేపట్టడం వలన, సదరు ప్రాంతంలో కొంతమేర ట్రాఫిక్ రద్దీ తగ్గిందన్నారు. త్వరలో హిందూ కాలేజీ ట్రాఫిక్ సిగ్నల్స్ నుంచి వెస్ట్ పారిష్ చర్చి వరకు రోడ్డును 120 అడుగుల మేర విస్తరించుటకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దానికి ఇరువైపులా స్థలాల యజమానులతో సంప్రదింపులు నిర్వహించట పూర్తయిందని, త్వరలోనే విస్తరణ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, ఈఈ సుందర రామిరెడ్డి, డీఈఈ రమేష్ బాబు, ట్రాఫిక్ సీఐ మహమ్మద్ నజీర్ బాషా, ఎస్ఐ హరిబాబు పాల్గొన్నారు.

పాత గుంటూరు, సంగడిగుంట శ్మశాన వాటికల పరిశీలన

గుంటూరు నగరంలోని శ్మశానాలను ఆధునిక హంగులతో అభివృద్ధి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. శనివారం నగరంలోని పాత గుంటూరు, సంగడిగుంట శ్మశాన వాటికలు పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ ప్రస్తుతం గుంటూరు నగరంలోని కొన్ని శ్మశానాలలో మౌలిక సదుపాయాలూ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని దృష్టిలో ఉంచుకొని నగరంలోని అన్ని శ్మశానాలను ఆధునిక హంగులతో అభివృద్ధి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్మశానాలలో దహన సంస్కారాలు నిర్వహించేందుకు క్రిమిటోరియం, కట్టెలతో నిర్వహించేందుకు, పూడ్చటం కోసం సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా శ్మశానాలకు వచ్చు దారిలో రోడ్లు ఆక్రమణలు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు ఫిర్యాదులు అందుతున్నాయని, ఆక్రమణలు ఉంటే వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, కార్పొరేటర్లు షేక్ మహమూద్, షేక్ మీరావలి, యాట్ల రవి కుమార్, యర్రి ధనలక్ష్మి సాయి, పోలవరపు జ్యోతి, వేముల జ్యోతి పద్మజ, సంకూరి శ్రీనివాసరావు, మానవతా స్వచంద సంస్థ ప్రతినిధులు పావులూరి రమేష్, రమణ బాబు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తోట ఆంజనేయులు, వాకా శ్రీనివాస రెడ్డి, డీఈఈ కల్యాణ్ రావు పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, వేదికపై రిజిస్ట్రార్ ఆచార్య కరుణ తదితరులు

ఏఎన్‌యూ: చిన్ననాటి స్నేహాలు కొనసాగించేందుకు పూర్వ విద్యార్థుల సంఘం వేదిక అని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం శనివారం యూనివర్సిటీలో నిర్వహించారు.. సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన వీసీ మాట్లాడుతూ చదువులు పూర్తి అయిన తరువాత వివిధ ప్రాంతాలలో, వృత్తుల్లో స్థిరపడిన వారు ఒక వేదికపైకి రావడం అభినందనీయమని చెప్పారు. పూర్వ విద్యార్థులు తమ కుటుంబంతోపాటు తాము చదివిన యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. జీవితంలో డబ్బులు సంపాదించడం ఎంతో ముఖ్యమని కానీ దానితో పాటు కుటుంబం వ్యవస్థ, మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని గుర్తించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులు ఇప్పుడు చదువుకుంటున్న విద్యార్థులకు పలు రకాలుగా సహకారం అందించాలని సూచించారు. సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జీవితంలో ఓ మధురానుభూతి అన్నారు. ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ సృజని, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.ప్రమీలారాణి, పూర్వ విద్యార్థులు, హెటిరో డ్రగ్స్ డెప్యూటీ మేనేజర్ డాక్టర్ వీఎస్ఎన్ మూర్తి, స్టాండర్డ్ చార్టడ్ బ్యాంక్ రిలేషన్ షిప్ మేనేజర్ సాయిరాం, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ సైంటిస్ట్ తేజేష్ వర్మ పాల్గొన్నారు.

యుక్త వయసులో గుండెపోటుపై అవగాహన



హెల్త్ చెకప్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కాశీవిశ్వనాథం, పక్కన డాకర్లు అంజిత్, హేమంత్, వినోద్‌కుమార్

గుంటూరు మెడికల్: యుక్త వయసులో ఉన్నవారు గుండెపోటుకు గురై ఆకస్మిక మరణాలు సంభవించడం ప్రస్తుతం ఎంతో ఆందోళన కలిగిస్తోందని ప్రముఖ ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఉప్పుటూరి అంజిత్ అన్నారు. ముందస్తుగా కార్డియాలజీ హెల్త్ చెకప్ ద్వారా ఆకస్మిక గుండెపోటులను నివారించవచ్చు అన్నారు. శనివారం స్థానిక కొత్తపేట ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని అమృత హాస్పిటల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక రాయితీతో హెల్త్ చెకప్ ప్యాకేజీలను ప్రకటించారు. హెల్త్ చెకప్ ప్యాకేజీలకు సంబంధించిన బ్రోచర్స్‌ని ప్రముఖ పారిశ్రామిక వేత్త మద్ది కాశీ విశ్వనాథం ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. డాక్టర్ అంజిత్ మాట్లాడుతూ కరోనా వైరస్ సోకిన వారికి కరోనా ట్రీట్మెంట్ తీసుకున్న వారికి ప్రస్తుత కాలంలో ఆరోగ్య విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వాటిని ముందస్తుగా గుర్తించేలా తమ హాస్పిటల్ హెల్త్ ప్యాకేజీలు రాయితీతో అందిస్తున్నట్లు వెల్లడించారు. వార్షికోత్సవం సందర్భంగా 50శాతం రాయితీతో వైద్య పరీక్షలు చేస్తున్నామని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మద్ది వినోద్‌కుమార్ తెలిపారు. అమృతతో ఆరోగ్యం పేరుతో అందిస్తున్న హెల్త్ చెకప్ ప్యాకేజీలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో తనిఖీలు

గుంటూరు ఎడ్యుకేషన్: సీతారామ్‌నగర్‌లోని అరుంధతి ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలను గుంటూరు ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్ శనివారం తనిఖీ చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులతో వర్క్‌బుక్స్ రాయించకపోవడంతో పాటు వర్క్‌బుక్స్‌ను దిద్దించకపోవడం గమనించారు. అదే విధంగా లక్ష్మీపురంలోని ఎస్ఆర్ఎంవో ఎయిడెడ్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేయగా, లెస్సన్‌ప్లాన్, టీచింగ్ డైరీ లేకుండా ఉండటాన్ని గమనించారు. బైజూస్ ట్యాబ్‌లను వినియోగించకపోవడంపై సీరియస్ అయ్యారు. సంబంధిత రెండు పాఠశాలల్లో తన దృష్టికి వచ్చిన విషయాలను డీఈఓకు నివేదిక పంపనున్నట్లు ఎంఈఓ ఖుద్దూస్ తెలిపారు.

డాక్టర్ పూర్ణచంద్రరావు సేవలు మరువలేనివి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అరుణ, చిత్రంలో డాక్టర్ సేవకుమార్ తదితరులు

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా, వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్‌గా డాక్టర్ బొల్లినేని పూర్ణచంద్రరావు జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ అన్నారు. స్థానిక జీఎంఏ హాల్లో ఐఎంఏ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ పూర్ణచంద్రరావు సంతాప సభ శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డాక్టర్ పూర్ణచంద్రరావు మృతి తీరనిలోటన్నారు. విశ్రాంత వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పరశురామయ్య మాట్లాడుతూ డాక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తాను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేసిన కాలంలో తనకు సూచనలు సలహాలు ఇస్తూ ఎంతో ప్రోత్సాహం అందించారని చెప్పారు. డాక్టర్ బి.వి.సుధీర్, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఐఎంఏ గుంటూరు శాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ టి.సేవ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అర్బన్ హెల్త్ సెంటర్ల ప్రారంభంలో స్థానికంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేశారన్నారు. ఐఎంఏ గుంటూరుశాఖ కార్యదర్శి డాక్టర్ వెలగా మహేష్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఆయుర్వేదం భారతీయుల జీవన నాదం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డ్వామా పీడీ యుగంధర్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ మహేశ్వరరెడ్డి

పాత గుంటూరు: మన సంస్కృతి సాంప్రదాయాల్లో భాగమైన ప్రాచీన ఆయుర్వేదం భారతీయుల జీవన విధానంలో భాగమైందని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. శనివారం బ్రాడిపేటలోని ఓ హోటల్‌లో ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ బృందావనం రాధాకృష్ణ మూర్తి రచించిన ఆయుర్వేద చికిత్సా పుస్తకాన్ని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ మహేశ్వర రెడ్డి, యుగంధర్ ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ రాధా కృష్ణమూర్తి, సామ్రాజ్యం దంపతుల్ని ఘనంగా సత్కరించారు. సమావేశానికి హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ దీక్షితులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ దీవి హరిప్రసాద్, జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి, సిరిపురపు శ్రీధర్, రొంపిచర్ల శేషాచార్యులు, డాక్టర్ బృందావనం రాజేష్, మేడూరి శ్రీనివాసమూర్తి, డాక్టర్ నారాయణం వేణుగోపాల్ పాల్గొన్నారు.

నగరంలో ఎస్పీ తనిఖీలు



కానిస్టేబుల్‌తో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన సీఐ రాజశేఖరరెడ్డి

నగరంపాలెం: గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ఏరియాల్లో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా పర్యటించారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు కోబాల్డుపేట, బ్రాడిపేట, లక్ష్మీపురం ప్రధాన వీధులతోపాటు గల్లీలోనూ కాలినడకన తనిఖీలు చేశారు. రాత్రి వేళ పలు పాయింట్లల్లో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బందితో వైర్‌లెస్ సెట్‌లో ఎస్పీ మాట్లాడారు. ఏ పాయింట్‌లో ఎక్కడున్నారు, ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు చెప్పిన వివరాలకు, చార్ట్‌ను సరిచూసుకున్నారు. కొద్దిసేపటి తరువాత వారు చెప్పిన పాయింట్‌లో ఉన్నారా లేదా అనేది పరిశీలించారు. ఏ ఒక్కరూ కూడా విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. గుంటూరు నగర వీధుల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా రాత్రివేళల్లో ఇన్‌చార్జి పర్యవేక్షణలో విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. అర్ధరాత్రుళ్లు ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే అదుపులోకి తీసుకోవాలని కోరారు. ఎస్పీ వెంట పశ్చిమ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు, పట్టాభిపురం సీఐ రాజశేఖరరెడ్డి, ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు ఉన్నారు.

లక్ష్యసాధనలో కఠోర శ్రమ వృథా కాదు

భాష్యం రామకృష్ణ



భాష్యం రామకృష్ణను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్యాన్ని సాధించేందుకు చేసే కఠోర శ్రమ ఎన్నడూ వృథా కాదని, అది ఎప్పటికైనా ఉత్తమ ఫలితాలను ఇస్తుందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. శనివారం భాష్యం సాయిభగవాన్ క్యాంపస్ టెన్త్ విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు కొరిటెపాడులోని ఓ ఫంక్షన్‌హాల్లో ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ ఉన్నతమైన విజయాలను సాధించాలంటే ఉన్నత భావాలు, దృక్పథం ఎంతో అవసరమని, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ స్ఫూర్తిని పొంది, భావి తరాలకు ఒక మంచి నమ్మకాన్ని కలిగించే విధంగా ప్రేరణగా నిలవాలని సూచించారు. చదువు విలువ ఎరిగి, కష్టపడి చదివితే భావి జీవితం ఉన్నతంగా ఉంటుందని, దీనిని గుర్తెరిగి నడుచుకోవాలని అన్నారు. ఈసందర్భంగా భాష్యం రామకృష్ణను ఉపాధ్యాయులు సత్కరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు పాల్గొన్నారు.

18న ఏఎన్‌యూలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఎం ప్రసాద్, పూర్వ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 18న ఎంకాం, ఎంబీఏ 1978–80, 1979–81 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థి, విశ్రాంత ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ తెలగారెడ్డి సత్యానందం తెలిపారు. శనివారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎం ప్రసాద్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సత్యానందం మాట్లాడుతూ ఆయా బ్యాచ్‌లకు చెందిన ఎంకాం, ఎంబీఏ పూర్వ విద్యార్థులందరూ 42 ఏళ్ల తరువాత తొలిసారిగా కలుసుకుంటున్నట్లు చెప్పారు. ఆయా బ్యాచ్‌లకు చెందిన వారు ఏఎన్‌యూలోని వాణిజ్యభవన్‌లో జరిగే అపూర్వ కలయికకు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.కనకదుర్గ, వై.వెంకటేశ్వర్లు, ఎల్‌వీ రావు, ఎన్.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.